# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శుక్రవారం 6, ఫిబ్రవరి 2026




# వెలవెలబోతున్న మందమర్రి మున్సిపాలిటీ..!

- చెన్నూరు నియోజకవర్గంలో కీలక కేంద్రం మందమర్రి
- ఓట్లలో బలం.. అభివృద్ధిలో మాత్రం వెనుకబాటు
- వసూళ్లు నిండుగా.. అభివృద్ధి మాత్రం మొండిగా..

మందమర్రి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త

రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల సందడి, రాజకీయ హడావిడి కనిపిస్తున్నప్పటికీ ఇందుకు భిన్నంగా మందమర్రి పట్టణం మాత్రం మున్సిపాలిటీ ఎన్నికలు లేక మోడుబారిన పరిస్థితిలో ఉంది. పేరుకే మున్సిపాలిటీగా కొనసాగుతున్న మందమర్రిలో ఏళ్లు గడుస్తున్నా ఎన్నికల జాడే లేకపోవడంతో పాలకవర్గం నిరక్ష్యంపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది. ఎన్నికల ముందు మాత్రం "మేము గెలిస్తే మొదట మందమర్రిలోనే మున్సిపాలిటీ ఎన్నికలు జరిపిస్తాం" అంటూ హామీలు ఇస్తూ ప్రజలను నమ్మబలికే నాయకులు, గెలిచిన తర్వాత అదే హామీలను విస్మరించి మొండి వైఖరి ప్రదర్శిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇతర పార్టీలపై విమర్శలు గుప్పించి, తాము అధికారంలోకి వస్తే పరిస్థితి మారుతుందంటూ వాగ్దానాలు చేసిన నేతలు కూడా తీరా చూస్తే పాత బాటలోనే నడుస్తున్న వైనం కనిపిస్తోంది. 2లో..

## మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో

# సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన సీపీ

### సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి: పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



మంచిర్యాల, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త

రాబోయే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా గురువారం మంచిర్యాల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని గర్ల్స్ హై స్కూల్‌లోని 59,60 డివిజన్ల సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్‌తో కలిసి ప్రత్యక్షంగా సందర్శించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, అక్కడి పరిసరాలను సమీక్షించి,శాంతి భద్రతల పరంగా తీసుకోవాల్సిన పలు సూచనలను గుర్తించి, సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల సమయంలో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడకుండా అవసరమైన అదనపు బందోబస్తు ఏర్పాటు చేయాలని కూడా సూచించారు. ప్రజలు భయభ్రాంతులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించే వాతావరణం కల్పించడానికి, పోలింగ్ రోజు ఎలాంటి అక్రమాలు, ఉద్రిక్తతలు చోటుచేసుకోకుండా పోలీసులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో శాంతి భద్రతలు కట్టుదిట్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఓటరు భయభ్రాంతులు లేకుండా ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా మిగతా 2లో..



# మున్సిపల్ పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి: కలెక్టర్

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:

రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పోలింగ్ అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కే . హరిత పేర్కొన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తో పాటు ఎన్నికల సాదారణ పరిశీలకులు ఆలోక్ కుమార్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, శిక్షణ ఐఎఫ్ఎస్ అధికారి భార్గవ్ కుమార్ లు కలిసి పాల్గొన్నారు ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పోలింగ్ అధికారులు సహయ పోలింగ్ అధికారులు సమర్తవంతంగా నిర్వహించాలన్నారు. మున్సిపల్ ఎన్నికలు బ్యాలెట్ పద్దతిలో మిగతా 2లో..




# టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

- ఢిల్లీలో ఉపాధ్యాయుల ధర్నా

– సారంగాపూర్, ఫిబ్రవరి 05, ప్రభాతవార్త: 2లో..

# మున్సిపల్ ఎన్నికల్లో వందశాతం ఓటింగే లక్ష్యం

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా
- ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి ఓటరు అవగాహన ర్యాలీ ప్రారంభం

– ఆదిలాబాద్, ఫిబ్రవరి 05, ప్రభాతవార్త:




2లో..

## మున్సిపల్ పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి: కలెక్టర్

(మొదటిపేజీ తరువాయి)

ఉంటాయని, పోలింగ్ ప్రక్రియలో వినియోగించే ప్రతి పత్రముపై అవగాహనా కలిగి ఉండాలని, పిఓ డైరీలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా నమోదు చేయాలన్నారు. ప్రతి రెండు గంటలకు పోలింగ్ శాతాన్ని జోనల్ అధికారులకు అందించాలని, పోలింగ్ ప్రక్రియలో వినియోగించే సామాగ్రిని, బ్యాలెట్ పత్రాలను సరి చూసుకోవలన్నారు. పోలింగ్ ప్రక్రియలో చిన్న పొరపాటు లేకుండా ప్రశాంతంగా నిర్వహించేలా ఎన్నికల అధికారులు సమన్వయముతో వ్యవహరించాలన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంగించకుండా ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి ప్రతీ ఒక్కరు విదులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

## టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

సారంగాపూర్, ఫిబ్రవరి 05, ప్రభాతవార్త:

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానంలో ఉపాధ్యాయులందరికీ టెట్ తప్పనిసరి చేయడాన్ని నిరసిస్తూ ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన చేపట్టాయి. గురువారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తెలంగాణ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. చాలా ఏళ్ల క్రితమే ఉద్యోగాల్లో చేరిన సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ నిబంధన నుంచి మినహాయింపు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. దశాబ్దాలుగా విద్యాబోధన చేస్తున్న తమకు ఇప్పుడు పరీక్షలు నిర్వహించడం సరికాదని పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సారంగాపూర్ మండలానికి చెందిన ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ మద్దతు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి సీనియర్లకు ఈ నిబంధన నుంచి వెసులుబాటు కల్పించాలని కోరారు.

## మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన సీపీ

(మొదటిపేజీ తరువాయి)

పోలీస్ తరపున అన్ని భద్రతా ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, చట్టవిరుద్ధ చర్యలు ఎవరు చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. స్థానిక ప్రజలకు, అన్ని పార్టీల కార్యకర్తలకు శాంతి భద్రతలు, చట్టపరమైన నిబంధనలు,ప్రవర్తనా నియమావళిని పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ భాస్కర్, మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్, మంచిర్యాల ఇన్స్పెక్టర్ ప్రమోద్ రావు, ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేంపల్లిలో ఉచిత వైద్య సేవలు

సిర్పూర్ (టి), ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :



సిర్పూర్ (టి) మండలంలోని వేంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రముఖ దంత వైద్యనిపుణురాలు డాక్టర్ యం.రుక్మిణి పాఠశాలలోని విద్యార్థులందరికీ దంతాలకు సంబంధించిన స్క్రీనింగ్ టెస్టు ఉచితంగా నిర్వహించి, దంత సమస్యల గురించి అవగాహన కల్పించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు ఉచితంగా సేవలందించిన డాక్టర్ రుక్మిణిని హెడ్మాస్టర్ పాఠశాల తరపున సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ కటుకం మధుకర్, ఉపాధ్యాయులు శ్యామ్సుందర్, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలింగ్స్టేషన్లు సందర్శించిన రామగుండం పోలీస్ కమిషనర్

**- ఎన్నికలు సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లు: అంబర్ కిషోర్ ఝా**

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త



క్యాతన్ పల్లి మున్సిపాలిటీ లో ఈనెల 11న ఎన్నికలు ఉన్నందున గురువారం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా. రామకృష్ణాపూర్ లోని పలు పోలింగ్ స్టేషన్లు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలన్నారు. ప్రతి ఒక్కరు ప్రజాస్వామ్య పద్ధతిలో ఓటు వేసేలా ఎన్నికల రోజు పోలింగ్ స్టేషన్లలో పటిష్ఠమైన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయాలని బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్కు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సీఐ రమేష్ రామకృష్ణాపూర్ ఎస్సై శ్రీధర్లు ఉన్నారు.

# వెలవెలబోతున్న మందమర్రి మున్సిపాలిటీ..!

(మొదటిపేజీ తరువాయి)

చెన్నూరు నియోజకవర్గంలో ఓట్ల పరంగా కీలకమైన పట్టణంగా గుర్తింపు ఉన్న మందమర్రి, అభివృద్ధి విషయంలో మాత్రం నిరక్ష్యానికి గురవుతోందన్న విమర్శలు పెరుగుతున్నాయి. ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలను గెలిపించే గడ్డగా పేరున్న మందమర్రి, ఎన్నికలు పూర్తయ్యాక మాత్రం పాలకుల దృష్టికి దూరమవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ రాజకీయాల్లో మందమర్రి కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, మున్సిపాలిటీ ఎన్నికలు లేకపోవడం వల్ల పట్టణం పరిపాలన స్థాయిలో వెనుకబడుతోంది. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, లైటింగ్ వంటి మౌలిక సదుపాయాలు ఏళ్ల తరబడి సమస్యలుగానే మిగిలిపోతున్నాయి.

మున్సిపాలిటీ ఎన్నికల పేరుతో ప్రతి ఎన్నికల వేళ హామీలు వినిపిస్తున్నా, అవి అమలుకి నోచుకోకపోవడం పట్ల ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. చెన్నూరు నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళికల్లో మందమర్రికి తగిన ప్రాధాన్యం దక్కడం లేదన్న అభిప్రాయం కూడా బలంగా వినిపిస్తోంది.

"ఓట్లలో కీలకం.. అభివృద్ధిలో పక్కనబాటు" అన్న మాట ఇప్పుడు మందమర్రి ప్రజల నోట వినిపిస్తోంది. ఇకనైనా చెన్నూరు నియోజకవర్గ ప్రతినిధులు మందమర్రి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, మున్సిపాలిటీ ఎన్నికలు నిర్వహించి పట్టణ అభివృద్ధికి బాటలు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

మున్సిపాలిటీలో ఎన్నికలు లేకపోవడంతో మందమర్రికి చెందిన రాజకీయ నాయకులు తమ పట్టణ అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా, పక్కనున్న మున్సిపాలిటీలకు ఇన్చార్జీలుగా మారడం తప్ప ఇక్కడి ప్రజలకు ఉపయోగపడే పనులు చేయలేకపోతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల సమయంలో మాత్రమే మందమర్రి నాయకులు గుర్తుకు వస్తారని, ఆ తర్వాత పట్టణానికి దక్కేదేమీ లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ ఎన్నికల కోసం కొందరు రాజకీయ నాయకులు జేఏసీగా ఏర్పడి పోరాటాలు చేస్తుండగా, మరోవైపు కొంతమంది దీనిని గ్రామ పంచాయతీగా మార్చితేనే మేలని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇకనైనా అధికార పక్షం ఈ అంశాన్ని సీరియస్గా తీసుకుని మందమరిలో మున్సిపాలిటీ ఎన్నికలు నిర్వహించే దిశగా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో వందశాతం ఓటింగే లక్ష్యం

ఆదిలాబాద్, ఫిబ్రవరి 05, ప్రభాతవార్త:

మున్సిపల్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, పట్టణంలో వంద శాతం ఓటింగ్ నమోదే లక్ష్యంగా పని చేయాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజార్షి షా పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కలెక్టరేట్లో ఎన్నికల అవగాహన ర్యాలీని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తో కలిసి ఆయన జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ కలెక్టర్ చౌక్, ఎన్టీఆర్ చౌక్, ఓల్డ్ హౌసింగ్ బోర్డు మీదుగా ఎస్టీయు భవన్ వరకు సాగింది. ఈ సందర్భంగా సాంస్కృతిక కళాజాత బృందాలు ఆలపించిన చైతన్య గీతాలు, ఓటు ప్రాముఖ్యతను తెలిపే నినాదాలతో పట్టణ వీధులు మారుమోగాయి. కలెక్టర్ స్వయంగా ర్యాలీలో పాల్గొని ప్రజలను ఉత్సాహపరిచారు. అనంతరం స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఎస్టీ భవన్లో ఏర్పాటు చేసిన ఓటరు అవగాహనా కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, పట్టణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలంటే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఓటు వేయాలన్నారు. ఓటర్లు ఎలాంటి ఆశలు, ప్రలోభాలకు లోనుకాకుండా, పారదర్శకంగా, నిర్భయంగా తమ ప్రతినిధులను ఎన్నుకోవాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు అధికారులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో కృషి చేయాలన్నారు. అనంతరం స్వీప్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరించి, ఓటు హక్కు వినియోగంపై అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీఓ స్రవంతి, మున్సిపల్ కమీషనర్ రాజు, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్, జిల్లా పౌర సంబంధాల అధికారి విష్ణువర్ధన్, మైనారిటీ సంక్షేమ అధికారి కలీమ్, మెప్మా పిడి సివిఎన్ రాజు, ఏవో వర్ణ, తహసీల్దార్లు శ్రీనివాస్, వేణుగోపాల్, గోవింద్, బూత్ స్థాయి అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, ఉద్యోగులు, సాంస్కృతిక సారథి కళాకారులు, విద్యార్థులు, యువత, తదితరులు పాల్గొన్నారు.



## వార్డ్ నెంబర్ 8 విద్యావతికి మద్దతుగా కోనేరు రమాదేవి గడపగడప ప్రచారం

కాగజ్నగర్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :

కాగజ్నగర్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ ప్రచారం మరింత వేగం అందుకుంది. వార్డ్ నెంబర్ 8 నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న విద్యావతి తరపున సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సతీమణి కోనేరు రమాదేవి విస్తృతంగా గడపగడప ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని పలు కాలనీలు, బస్తీలు, వీధుల్లో ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను కలిసి బీఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలుపాలని, విద్యావతిని భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలు, అభిప్రాయాలు తెలుసుకుంటూ ముందుకు సాగారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వల్ల సాధారణ ప్రజలకు కలిగిన లాభాలను వివరించారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, రైతులు, యువత కోసం ప్రవేశపెట్టిన పథకాలు భవిష్యత్తులో మరింత బలంగా కొనసాగాలంటే బీఆర్ఎస్ పార్టీకి మద్దతు అవసరమని ఆమె పేర్కొన్నారు. స్థానిక స్థాయిలో అభివృద్ధి పనులు వేగవంతం కావాలంటే అనుభవం ఉన్న పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు.ప్రచారంలో భాగంగా తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు వంటి స్థానిక సమస్యలపై ప్రజలు చెప్పిన విషయాలను రమాదేవి శ్రద్ధగా విన్నారు. ఎన్నికల అనంతరం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వార్డ్ అభివృద్ధికి విద్యావతి సరైన నాయకురాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేసేందుకు కట్టుబడి ఉంటారని తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు, మహిళలకు స్వయం ఉపాధి పథకాలు మరింతగా అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయ కులు, కార్యకర్తలు, మహిళా విభాగం ప్రతినిధులు, యువజన విభాగ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పార్టీ జెండాలు, నినాదా లతో కాలనీల్లో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. ప్రచారానికి స్థానిక ప్రజల నుంచి సానుకూల స్పందన లభించిందని నాయకులు తెలిపారు. సమన్వ యంతో ముందుకు సాగుతున్న బీఆర్ఎస్ శ్రేణులు కాగజ్నగర్ మున్సిపల్ ఎన్నిక ల్లో విజయం సాధించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. వార్డ్ అభివృ ద్ధి, సంక్షేమం, పారదర్శక పాలన లక్ష్యంగా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు.

## మంచిర్యాలను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలుపుతాం

**- మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్రావు**

**- 60 డివిజన్లలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం**

నస్పూర్, ప్రభాతవార్త



మంచిర్యాలను అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలుపుతానని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. నస్పూర్ పట్టణంలో గురువారం నిర్వహించిన ఎన్నికల సభలో ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్తో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ, మంచిర్యాల కార్పొరేషన్లోని 60 డివిజన్లను గెలిచి కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి చివరి శ్వాస వరకు పాటుపడతానని పేర్కొన్నారు. నస్పూర్ పట్టణాన్ని జిల్లా కేంద్రానికి సమానంగా తీర్చిదిద్దుతామని ప్రేమ్ సాగర్ రావు చెప్పారు. సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి పట్టాలు అందజేస్తామన్నారు. లక్ష్మీ టాకీస్ నుంచి నస్పూర్ మీదుగా కొత్త రోడ్డు వరకు బైపాస్ నిర్మిస్తామని వెల్లడించారు. స్థానిక యువతకు ఉద్యోగ కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. అనారోగ్యంతో ఉన్నా ప్రజల కోసం పని చేస్తున్నట్లు వివరించారు. రిటైర్డ్ సింగరేణి కార్మికులకు రేషన్ కార్డులు మంజూరు చేయించామని గుర్తు చేశారు. కరకట్ట, ఆసుపత్రి నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఏఐసిసి సెక్రెటరీ సచిన్ సావంత్ మాట్లాడుతూ గత రెండేళ్ల కాంగ్రెస్ పాలన చూసి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. 60 స్థానాల్లో విజయం సాధించి మంచిర్యాల కాంగ్రెస్ అడ్డా అని నిరూపించాలని పిలుపునిచ్చారు. సభకు వచ్చిన ప్రజా స్పందన చూస్తుంటే విజయం ఖాయమనిపిస్తోందని అన్నారు. బిజెపి, బిఆర్ఎస్ నాయకుల మాటలు నమ్మవద్దని హెచ్చరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను విక్రయిస్తోందని ఆరోపించారు. అమెరికాతో చేసుకున్న వాణిజ్య ఒప్పందాల వల్ల భారత రైతులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హస్తం రైతులు, సామాన్యులకు రక్షణ కవచమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, ఐఎన్టీయూసీ నాయకుడు జెట్టి శంకర్ రావు, కార్పొరేటర్ అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# పోలింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

**- మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**

2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఈ నెల 11వ తేదీన జరగనున్న పోలింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మాస్టర్ ట్రైనర్ల ఆధ్వర్యంలో పి.ఓ., ఎ.పి.ఓ.లకు నిర్వహించిన శిక్ష ణకార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా పోలింగ్ ప్రక్రియ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 800 ఓటర్లకు మించకుండా పోలింగ్ జరిగేలా ఏర్పాట్లు చేయడం జరిగిందని, ప్రతి పోలింగ్ కేంద్రంలో కేటాయించబడిన సిబ్బందికి పోలింగ్ ప్రక్రియలోని ప్రతి అంశం తెలిసి ఉండాలని, ఓటింగ్ కంపార్ట్మెంట్ గోప్యత నిర్వహణ సక్రమంగా చేయాలని తెలిపారు. ఇతరులకు బదులుగా ఓటు వేయడం, ఒకటికి మించి ఓటు వేయడం జరగకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలని, పోలింగ్ ముగిశాక తీసుకోవలసిన జాగ్రత్తలు, పాటించవలసిన నియమాలపై శిక్షణలో తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ అధికారులకు కేంద్రాలలో త్రాగునీరు, మూత్రశాలలు, లైటింగ్, ఫ్యాన్ వంటి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని, గర్భిణీ స్త్రీలు, బాలింతలు మినహాయింపు కోరినట్లయితే ఆమోదించడం జరుగుతుందని, మిగతా వారికి అత్యవసర ఆరోగ్య పరిస్థితులు, ఇతర ఇబ్బందులు తలెత్తితే తప్ప పోలింగ్ విధులలో మినహాయింపు ఉండదని తెలిపారు. పోలింగ్ రోజున ఓటింగ్ సంబంధిత ప్రతి నమూనాను పూర్తిగా నింపాలని, పోలింగ్ నిర్వహణ ప్రక్రియలో పొరపాట్లకు తావు లేకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. 11వ తేదీన పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని, 12 రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే), 13వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికలలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించుకోవాలని, అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ హరిప్రసాద్, మంచిర్యాల నగర పాలక సంస్థ జూనియర్ అకౌంట్ ఆఫీసర్ సిహెచ్. అనితాదేవి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## మండల గ్రామ పాలన అధికారుల సంఘం ఏకగ్రీవ ఎన్నిక

**జన్నారం, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**

జన్నారం మండలంలోని 16 మంది గ్రామ పాలన అధికారులు సమావేశమై మండల గ్రామ పాలన అధికారుల సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల సంఘం అధ్యక్షుడిగా కవ్వాల్ గ్రామ పాలన అధికారి బలుసు రాజన్నను, ఉపాధ్యక్షులుగా బాదం పెల్లి గ్రామ పాలన అధికారి దుంపల ప్రదీప్ కుమార్‌ను, కోశాధికారిగా కిష్టాపూర్ గ్రామ పాలన అధికారి నడిగోటు కవితను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల సంఘం బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు. అనంతరం నియామక పత్రం పదహారు మంది సభ్యులు సంతకం చేసి జన్నారం మండల ఇన్చార్జి ఎమ్మార్వో రామ్మోహన్‌కు అందజేశారు.




## గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలి

**జన్నారం, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**

అంగన్వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా తీసుకోవాలని తిమ్మాపూర్ సర్పంచ్ గుగ్లావత్ సంగీత రవి నాయక్, కార్యదర్శి మేక లావణ్య సూచించారు. గురువారం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం1లో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గర్భిణీ బాలింతలకు గుడ్లు పౌష్టికాహారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,వారు మాట్లాడుతూ మూడు నుంచి ఐదు ఏళ్ల లోపు పిల్లలను ప్రతిరోజూ అంగన్వాడీ కేంద్రాలకు పంపించి వారి శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ జాడి సంజీవరాణి, వార్డు సభ్యులు శంకర్, మల్లేష్, ఆయా గుండ మమత, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

## ఈ నెల 6, 7 తేదీలలో సీఎం కప్ నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు

**- మంచిర్యాల జిల్లా యువజన క్రీడా సేవల అధికారి గుర్రాల హనుమంత రెడ్డి**




**నస్పూర్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**

సీఎం కప్ 2025 పోటీలలో భాగంగా ఈ నెల 6, 7 తేదీలలో జిల్లాలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందని మంచిర్యాల జిల్లా యువజన క్రీడా సేవల అధికారి గుర్రాల హనుమంత రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నూరు నియోజకవర్గంలో మినీ క్రీడా మైదానం, బెల్లంపల్లి నియోజకవర్గంలో ప్రధానమంత్రి శ్రీ టి.జి.ఆర్.జె.సి. తాళ్లగురజాలలో ఈ నెల 6వ తేదీన, మంచిర్యాల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాధికార సంస్థ మైదానంలో ఈ నెల 7వ తేదీన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్, ఫుట్ బాల్, యోగా, చెస్, బ్యాడ్మింటన్, క్యారమ్స్, కరాటే ఆటలలో పోటీలు నిర్వహించడం జరుగుతుందని, మండల స్థాయిలో ఎంపిక కాబడిన క్రీడాకారులు తమ నమోదు స్లిప్, నిజ ఆధార్ కార్డుతో సకాలంలో హాజరుకావాలని, ఆలస్యంగా వచ్చిన క్రీడాకారులకు అనుమతి ఉండదని తెలిపారు.

## అవుట్ రీచ్‌మ్యాప్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

**తిర్యాని, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:**

తిర్యాని మండలంలోని ఏదులపహాడ్ గ్రామంలో అవుట్ రీచ్‌మ్యాప్ సేవా సంస్థ మంచిర్యాల ఆధ్వర్యంలో గురువారం కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి కారోలిన్ విగ్ మాట్లాడుతూ ఏదులపహాడ్ గ్రామంలో 20మంది గిరిజన మహిళలకు 5నెలల పాటు కుట్టు మిషన్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం అర్హులైన వారికి సబ్సిడిలో కుట్టు మిషన్లను పంపిణి చేయడం జరుగుతుందన్నారు. అలాగే శిక్షణ తీసుకున్నవారికి సర్టిఫికేట్‌లను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సుమన, ప్రమోద్, లలిత, ట్యూటర్ సుశీల, మహిళలు పాల్గొన్నారు.



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

## రాష్ట్ర స్థాయి వాలీబాల్ జట్టుకు ఆస్నాద్ విద్యార్థుల ఎంపిక




**చెన్నూరు టౌన్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**

రాష్ట్ర స్థాయిలో జరగనున్న సబ్ జూనియర్ వాలీబాల్ బాలికల జట్టుకు మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంలోని ఆస్నాద్ జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, వ్యాయామ ఉపాధ్యాయుడు జె. సత్యనారాయణ తెలిపారు. ఎంపికైన వారిలో జి. శ్రీవర్షిణి, ఎం. నక్షత్ర, ఎం .శ్రీనిధి, ఐ. రిశ్విత ఎంపికయ్యారన్నారు. ఆదిలాబాద్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 1న మంచిర్యాల జడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో సబ్ జూనియర్ బాలికల జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 9వ తరగతి విద్యార్థులు ముగ్గురు శ్రీ వర్షిని , శ్రీనిధి , నక్షత్ర, 8వ తరగతి విద్యార్థిని రిషిత అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు నిజామాబాద్ జిల్లాలోని కుమ్మరపల్లి మండలంలో జరగబోయే తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ వాలీబాల్ పోటీల్లో పాల్గొంటున్నారని వారు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి. అనురాధ, పాఠశాల ఏఎంసి చైర్మన్ సత్యమ్మ, ఉపాధ్యాయులు మరియు గ్రామస్తులు అభినందించారు.

## అరుణాచల నృత్యోత్సవంలో నటరాజ కళాక్షేత్ర విద్యార్థుల ప్రతిభ

**జన్నారం, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**




అరుణాచలంలోని లంబోదర అకాడమీ ఆధ్వర్యంలో జనవరి 31న ఘనంగా నిర్వహించిన అరుణాచల నృత్యోత్సవంలో జన్నారం, లక్షెట్టిపేట్ విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో జన్నారం, లక్సెట్టిపేటలోని నటరాజ కళాక్షేత్రం విద్యార్థులు పాల్గొని తమ అద్భుతమైన నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు. గురువు నర్మదా మార్గదర్శకత్వంలో శిక్షణ పొందిన విద్యార్థులు సంప్రదాయ శాస్త్రీయ నృత్యాలకు ప్రతీకగా నిలిచే విధంగా ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తమ నైపుణ్యం, భావప్రకటన, లయాత్మకత నృత్యోత్సవానికి మరింత శోభను తీసుకొచ్చారు. ఈ సందర్భంగా నిర్వాహకులు విద్యార్థులను అభినందించగా, తల్లిదండ్రులు, కళాప్రియులు గురువు నర్మదా శిక్షణ, నటరాజ కళాక్షేత్రం సేవలను ప్రత్యేకంగా ప్రశంసించారు. భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని కార్యక్రమాల్లో పాల్గొని కళారంగంలో మరింత ఉన్నత స్థాయికి చేరాలని విద్యార్థులకు ఆకాంక్షలు తెలిపారు.

# మంచిర్యాల కార్పొరేషన్‌పై గులాబీ జెండా ఎగురవేస్తాం

**- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్ కుమార్**

నస్పూర్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త



సమావేశంలో మాట్లాడుతున్న నడిపెల్లి విజిత్ కుమార్

మెజారిటీ స్థానాలను గెలుచుకొని మంచిర్యాల కార్పొరేషన్ పై గులాబీ జెండా ఎగురవేస్తామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో ప్రజల నుండి అనూహ్య స్పందన లభిస్తోందని చెప్పారు. ప్రజలు కెసిఆర్ పాలనను మళ్లీ కోరుకుంటున్నారని వివరించారు. మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి కేవలం బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపుతోనే సాధ్యమని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు హయాంలో మంచిర్యాల నియోజకవర్గం అన్ని విధాల అభివృద్ధి చెందిందని విజిత్ కుమార్ తెలిపారు. గత ప్రభుత్వ హయాంలోనే మంచిర్యాల జిల్లా కేంద్రం ఏర్పడిందని, నస్పూర్ మండలం ఏర్పాటుతో పాటు కలెక్టరేట్ భవన నిర్మాణం కూడా అప్పుడే జరిగిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. సింగరేణిలో కారుణ్య నియామకాలను పునరుద్ధరించి కార్మిక కుటుంబాల్లో కెసిఆర్ వెలుగులు నింపారని కొనియాడారు. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు విఫలమయ్యాయని ఆరోపించారు. కార్మికులకు కనీసం సరైన మందులు కూడా ఇవ్వలేని పరిస్థితిలో సింగరేణి సంస్థ ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి పరిరక్షణ టిబిజికెఎస్‌తోనే సాధ్యమని స్పష్టం చేశారు. కార్మికులకు అనేక హక్కులు సాధించిన చరిత్ర తమ సంఘానికే ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు అక్కూరి సుబ్బయ్య, మెరుగు పవన్ కుమార్, వంగ తిరుపతి, బండి రమేష్, జక్కుల రాజేశం, పానుగంటి సత్తయ్య, గుంట జగ్గయ్య, ముక్కెర వెంకటేశం, అన్వేష్ రెడ్డి, పొగాకు రమేష్, తిప్పని తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



## వార్డు, మున్సిపల్ అభివృద్ధే సీపీఎం లక్ష్యం

**- ప్రజలకు స్వయం ఉపాధి అవకాశాల కల్పనకు సీపీఎం కృషి**

**- పైల్ల ఆశయ్య సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు**

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త

సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో గురువారం రోజున ఉదయం 9వ వార్డు సీపీఎం అభ్యర్థి అయిన దుంపల రంజిత్ కుమార్ సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని పైళ్ల ఆశయ్య సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నారు. వార్డులో నెలకొన్న సమస్యల పరిష్కారం కొరకు, వార్డు అభివృద్ధి కొరకు సిపిఎం ప్రజల పక్షాన ఉండి పోరాడుతుందన్నారు. గత 15 ఏళ్లుగా విద్యార్థి, కార్మిక, ఉద్యోగుల సమస్యలపై పోరాడుతున్న దుంపల రంజిత్ కుమార్ తొమ్మిదవ వార్డు ప్రజలందరూ ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కనికారపు అశోక్ సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, కె. బుచ్చయ్య, అంబటి లక్ష్మణ్, లక్ష్మి, అ చల్, అనిత తదితరులు పాల్గొన్నారు.



## ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:

ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో రెండో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రజలు తమ ఓటు హక్కును ఇలాంటి ప్రలోభాలకు కూడా ప్రశాంత వాతావరణంలో వినియోగించుకోవాలని ఆసిఫాబాద్ ఎస్హెచ్ఓ బాలాజీ వరప్రసాద్ అన్నారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు మనోధైర్యం కల్పించడంలో భాగంగా జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆదేశాల మేరకు గురువారం పోలీసులు భారీగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్హెచ్ఓ మాట్లాడుతూ ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవడంలో ఏమైనా సమస్యలు తలెత్తితే తమకు వెంటనే తెలియజేయాలని తెలిపారు. ఓటర్లకు ఏమైనా సమస్యలు తలెత్తితే నిమిషాల్లో తమ ముందు ఉండి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. పోలీసుల ఫ్లాగ్ మార్చ్ జిల్లా కేంద్రంలోని పలు విధుల గుండా కొనసాగింది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని సిఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, ప్రత్యేక బాలగాలు పాల్గొన్నాయి.

## పిచ్చి మొక్కలు, పొదలను పూర్తిగా తొలగించాలి

**- తాండూర్ ఎంపీడీవో శ్రీనివాస్**

తాండూర్, జనవరి 5, ప్రభాతవార్త :



సింగరేణి ప్రధాన రహదారికి ఇరువైపుల పెరిగిన పిచ్చి మొక్కలు, పొదలను పూర్తిగా తొలగించాలని తాండూర్ ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. మాదారం గ్రామపంచాయతీ పరిధిలోని సింగరేణి ప్రధాన రహదారికి ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, పొదల తొలగింపు పనులను గురువారం ఎంపీడీవో నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వాహనదారుల రాకపోకలకు ఎలాంటి, ఇబ్బందులు, అంతరాయం లేకుండా రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు పొదలను తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డి, ఉపసర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, రాజీవ్ నగర్ ఉపసర్పంచ్ కాపర్తి సుభాష్, వార్డు సభ్యులు బానేష్, కార్యదర్శి సౌందర్య పాల్గొన్నారు.

## వీధి కుక్కలు బెడదను అరికట్టాలి

తాండూర్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :



కిష్టంపేట గ్రామ పంచాయతీ రెండో వార్డులో వీధి కుక్కల బెడదను అరికట్టాలని స్థానికులు కోరారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం సర్పంచ్ సార్ల తిరుపతి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు కార్యదర్శి ఉదయ్ రాంప్రసాద్ కు వినతిపత్రం అందజేశారు. గత కొన్ని రోజులుగా వీధి కుక్కల పలువురిపై దాడి చేసి గాయపరిచినట్లు కార్యదర్శి దృష్టికి తెచ్చారు. వీధి కుక్కల బెడద నివారణకు తగిన చర్యలు తీసుకుంటామని కార్యదర్శి హామీ ఇచ్చినట్లు స్థానికులు తెలిపారు.

## కిడ్నీ బాధితురాలికి ఆర్థిక సహాయం అందజేత

**- పెందోర్ శ్యాంరావు పటేల్ సేవా సమితి ఆధ్వర్యంలో దాతల సహకారంతో సేకరించిన రూ. 25,053 పంపిణీ**

కెరమెరి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన బొమ్మెన శిరీష కొన్ని రోజులుగా కిడ్నీ వ్యాధితో బాధపతున్నారు. రెక్కడితే గాని డొక్కాడిని పరిస్థితి వారిది. ఆసుపత్రికి వెళ్ళడానికి చిల్లిగువ్వ లేక అయోమయంలో ఇబ్బందులు పడుతున్నారు. కాగా ఈ విషయమై తెలుసుకున్న పెందోర్ శ్యాంరావు పటేల్ సేవా సమితి వారు ఆమెకు కుటుంబానికి అండగా నిలిచారు. దాతల సహకారంతో సేకరించిన 25,053 రూపాయలను నగదు ఆర్థిక సాయాన్ని గురువారం వారి నివాసానికి వెళ్లి బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో కెరమెరి సర్పంచ్ పెందోర్ ఆనందరావు, పెందోర్ శ్యాంరావు పటేల్ సేవా సమితి వ్యవస్థాపకులు పెందోర్ శ్రీనివాస్, సేవా సమితి సభ్యులు పెందోర్ వినేష్, దిందార్ షా, సెడ్మకి తుకారాం, వికార్ దేశ్ముక్, షేక్ ఫారిధ్, కంబాల వినేష్, కూటికేల వెంకటస్వామి, కేంద్రే చంద్రకాంత్, షేక్ మున్ను, ఎర్ర పోశం, గుర్నులే కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం



## భూసేకరణ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

మంచిర్యాల, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త

జిల్లాలోని కోటపల్లి మండల పరిధిలో మేడిగడ్డ లక్ష్మి బ్యారేజ్ బ్యాక్ వాటర్ కారణంగా ముంపుకు గురయ్యే భూముల సేకరణ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల రాజస్వ మండల అధికారి కార్యాలయంలో ఆర్‌డిఓ శ్రీనివాస్ రావుతో కలిసి భూసేకరణ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మేడిగడ్డ లక్ష్మి బ్యారేజ్ బ్యాక్ వాటర్ కారణంగా జిల్లాలోని కోటపల్లి మండల పరిధిలో గల దేవులవాడ, అర్జునగుట్ట, రావులపల్లి, రాపనపల్లి గ్రామాల భూములు ప్రభావితమయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఈ క్రమంలో భూసేకరణ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. అర్హులైన రైతులకు నష్టపరిహారం అందించడంలో భాగంగా భూసేకరణ సక్రమంగా నిర్వహించాలని, ప్రక్రియ వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు 50 శాతం సబ్సిడీపై ప్లాస్టిక్ క్రేట్లు పంపిణీ

తాండూర్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :



ఉద్యాన శాఖ ద్వారా కూరగాయలు సాగు చేసే రైతులకు కూరగాయలు రవాణా చేయడం కోసం 50 శాతం సబ్సిడీ పై ప్లాస్టిక్ క్రేట్లు పంపిణీ చేస్తున్నట్లు బెల్లంపల్లి ఉద్యాన శాఖ అధికారి జక్కుల అర్చన తెలిపారు. ఒక ప్లాస్టిక్ క్రేట్ అసలు ధర రూ.337లు కాగా 50 శాతం సబ్సిడీపై రూ.168.50లకు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఒక్కొక్క రైతుకు 40 ప్లాస్టిక్ క్రేట్లు మాత్రమే అందజేస్తామని తెలిపారు. ఆసక్తిగల రైతులు పూర్తి వివరాల కోసం అమ్మ 8977713955 నంబర్ ను సంప్రదించాలని అమె కోరారు.

# అభ్యర్థుల ఖర్చుల వివరాలను స్పష్టంగా నమోదు చేయాలి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:

మున్సిపల్ ఎన్నికలలో అభ్యర్థుల ఖర్చుల వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని మున్సిపల్ ఎన్నికల పరిశీలకులు దేవేందర్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికలలో విధులు నిర్వహిస్తున్న ఫ్లయింగ్, స్టాటిస్టిక్ సర్వేయలెన్స్ బృందాలు, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ, వీడియో సర్వేయలెన్స్, సిఎంసి బృందాలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎన్నికల పరిశీలకులు మాట్లాడుతూ చెక్ పోస్ట్ ల వద్ద ప్రతి వాహనాన్ని తనిఖీ చేపట్టాలని, 50 వేల రూపాయల పరిమితికి మించి నగదు తరలిస్తే సరైన అనుమతి పత్రాలు పరిశీలించాలని, అనుమతి పత్రాలు లేకుండా నగదు తరలిస్తే సీజ్ చేయాలని తెలిపారు. అభ్యర్థులు సభలు, సమావేశాలు, ర్యాలీలపై నిఘా పెట్టాలని, దినపత్రికలలో వచ్చే పెయిడ్ న్యూస్ లు, ప్రచార ప్రకటనలను, ప్రసార సాధనాలలో వచ్చే చెల్లింపు వార్తల వివరాలను, సంబంధిత అభ్యర్థుల వివరాలను ప్రతిరోజు నివేదికలు అందించాలని తెలిపారు. ఎన్నికలలో అభ్యర్థులు ఖర్చు చేసే ప్రతి రూపాయిని అభ్యర్థుల ఖాతాలలో నమోదు చేయాలని, ఎన్నికలలో ప్రలోభాలు జరగకుండా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం నిఘా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రతి అంశాన్ని పర్యవేక్షించాలని, ఆబ్కారీ శాఖ అధికారులు ప్రతిరోజు నిల్వ వివరాలు, అమ్మకాల నివేదికలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైజనింగ్ అధికారి నదీమ్, ఎన్నికల బృందాల అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ ఎన్నికల పరిశీలకులు దేవేందర్ రెడ్డి



హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ నితికా పంత్

## హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ

కాగజ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :

మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ఈనెల 7వ తేదీన కాగజ్‌నగర్ పర్యటనకు రానున్న నేపథ్యంలో కాగజ్‌నగర్ లోని ఎలిప్యాడ్ సభ స్థలం తదితర ప్రాంతాలను జిల్లా ఎస్పీ నితికాపంత్ గురువారం పర్యవేక్షించారు. పోలీస్ అధికారులకు, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఎస్పీ వెంట కాగజ్‌నగర్ డిఎస్పి వహిదుద్దీన్, కాగజ్‌నగర్ టౌన్ సిఐ ప్రేమ్‌కుమూర్, కాగజ్నగర్ రూరల్ సీఐ కుమారస్వామి, తదితరులు ఉన్నారు.



33వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కొక్కిరాల సురేఖ

## కాంగ్రెస్ గెలుపుతోనే కార్పొరేషన్ అభివృద్ధి

### - 33వ డివిజన్‌లో అభ్యర్థి కుమారస్వామి తరపున కొక్కిరాల సురేఖ ప్రచారం

నస్పూర్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త

కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుతోనే మంచిర్యాల కార్పొరేషన్ అభివృద్ధి సాధ్యమవుతుందని మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో గురువారం ఆమె 33వ డివిజన్‌లో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు బలపరిచిన కార్పొరేటర్ అభ్యర్థి ఎంబడి కుమారస్వామిని హస్తం గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. స్థానిక సమస్యల పరిష్కారం, నగర సుందరీకరణ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని సురేఖ వివరించారు. ఇంటింటికీ తిరుగుతూ అభ్యర్థి విజయానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సంక్షేమ పథకాలు ప్రజలకు చేరాలంటే కాంగ్రెస్ అభ్యర్థులను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి భీమా చెక్కు అందజేత

### - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త



ఒమన్ దేశంలో మృతి చెందిన జిల్లాకు చెందిన బాధితుడి కుటుంబానికి భీమా చెక్కు అందించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ ఛాంబర్‌లో బాధితుడి కుటుంబ సభ్యులకు భీమా చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని జన్నారం మండలం కవ్వాల్ నేతకానివాడకు చెందిన దుర్గం మల్లేష్ ఓమన్ దేశంలో మృతి చెందగా బాధితుడి భార్య దుర్గం గంగరాజుకు 23 లక్షల 19 వేల 647 రూపాయల బీమా చెక్కులు అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సూచనలు చేస్తున్న జిల్లా ఎస్పీ

## జిల్లా ఎస్పీ బెజ్జూర్ పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ

బెజ్జూర్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :

బెజ్జూర్ పోలీస్ స్టేషన్ ను కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా నీతికా పంత్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ లోని రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. హాజరు పట్టికను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని, అసాంఘిక కార్యకలాపాలు, మాదకద్రవ్యాల నియంత్రణపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని, మహిళలు, బాలికల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు.

## ఘనంగా ఎల్లారం పోచమ్మ బోనాలు

బెజ్జూర్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:

బెజ్జూర్ మండలంలోని మత్తడి స్ప్రింగ్ ఆనకట్ట సమీపంలో ఎల్లారం పోచమ్మ బోనాల కార్యక్రమం బుధ, గురు వారాల్లో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఇందిరానగర్ శ్రీ మహంకాళి దేవస్థాన ప్రధాన అర్చకులు దేవార వినోద్ స్వామి ఆధ్వర్యంలో ఎల్లారం పోచమ్మ బోనాల ఊరేగింపు ఆలయం చుట్టూ నిర్వహించారు. అనంతరం బోనాలను అమ్మవారికి సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు పూజ చేసే విధానం గురించి, భక్తి మార్గం గురించి దేవర వినోద్ స్వామి భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జిల్లాల సుధాకర్ గౌడ్, జాతర నిర్వాహకులు కొండవీటి భాస్కర్ రాజ్, సర్పంచ్ చెండే పద్మ శంకర్, కుష్ణపల్లి సర్పంచ్ లావణ్య, కొట్రంగి రామకృష్ణ, కేశెట్టి శ్రీనివాస్, గోపాల్, వెంకటి, సామల తిరుపతి, విట్టయ్య, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



బోనాల కార్యక్రమంలో దేవర వినోద్ స్వామి

## ఘనంగా లక్ష్మి గణపతి ఆలయ వార్షికోత్సవం

తిర్యాని, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:

తిర్యాని మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ ్మ గణపతి ఆలయ 9వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గణపతి అర్చన హోమ యజ్ఞాలను నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాగా స్వయంభువుగా వెలసిన దేవుడు కావడంతో మండలంలోని భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి అజయ్, ఆలయ కమిటీ అధ్యక్షులు తాళ్ల శ్రీనివాస్ గౌడ్, కమిటీ సభ్యులు మార్క శంకర్ గౌడ్, అన్నం శ్రీకాంత్, మ్యన రాజు, రంగు సాయి, సింగం ప్రదీప్, తాళ్ల నరేష్ గౌడ్, హరీష్ గౌడ్ , నల్లూరి సాగర్, నాగపురి అనురాగ్, లక్ష్మీ గణపతి ఆలయ మహిళా కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

## సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా సత్యనారాయణ

నార్నూర్, ఫిబ్రవరి 05, ప్రభాతవార్త:

నార్నూర్ మండల సర్పంచుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కనక సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా బానోత్ కావేరి, ఉపాధ్యక్షుడిగా జాదవ్ పరమేశ్వర్, సెక్రటరీగా చౌహన్ దిగంబర్, కోశాధికారులుగా రాథోడ్ ఉష, రాథోడ్ సకారం, ప్రచార కార్యదర్శిగా పెందూర్ లక్ష ్మన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శి బాణోత్ గజానంద్ నాయక్ నూతన కార్యవర్గాన్ని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ పంచాయతీల్లోని సమస్యల పరిష్కారానికి అందరం ఐకమత్యంతో పనిచేస్తామని ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నాగోరావ్, సర్పంచులు రాథోడ్ సురేష్, పరమేశ్వర్, మాణిక్ రావ్, పెందూర్ లింగు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికైన సభ్యులను సన్మానిస్తున్న గజానంద్ నాయక్

# సమయపాలన పాటించని సిబ్బందిపై చర్యలు

**- కలెక్టర్ కె.హరిత**

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:**



హాజరు పట్టికను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ కె.హరిత

విధుల పట్ల సమయపాలన పాటించని అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల పలు ప్రభుత్వ శాఖల కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఆబ్కారీ మధ్య నిషేధ, పౌరసరఫరాలు, వ్యవసాయ, భూగర్భ జల, మత్స్య, వైద్య ఆరోగ్య, విద్య, భూ కొలతల శాఖల కార్యాలయాలను తనిఖీలు నిర్వహించి అధికారులు, సిబ్బంది హాజరు పట్టికలను చూసి గైరహాజరైన వారి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొంతమంది డిప్యూటేషన్ పై పనిచేస్తున్నారని అధికారులు వివరించారు. హాజరైన అధికారులు రిజిస్టర్లు సంతకం చేయకపోవడాన్ని గుర్తించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన ప్రభుత్వ సేవలు సకాలంలో అందాలంటే అధికారులు, సిబ్బంది విదుల పట్ల సమయపాలన పాటించాలని, చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని తెలిపారు. మరోసారి సమయానికి విధులకు హాజరుకాని సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షణ ఐ ఎఫ్ ఎస్ అధికారి భార్గవ్ కుమార్, పలు ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:**

ఆసిఫాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలను అదనపు కలెక్టర్ దీపక్ తివారి గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహిస్తున్న పదవ తరగతి ప్రత్యేక తరగతులను స్వయంగా తనిఖీ చేశారు. పదవ తరగతి విద్యార్థులకు సాయంత్రం వేళల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు ఎలా జరుగుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ముచ్చటించి వారి ప్రిపరేషన్ స్థాయిని పరీక్షించారు. రాబోయే పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా, కష్టపడి చదివి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారికి అర్థమయ్యే రీతిలో బోధన సాగించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## ఆర్యవైశ్య సంఘం సేవ బాట...దుప్పట్ల పంపిణీ

**పెంచికల్‌పేట్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :**

సామాజిక సేవ కార్యక్రమాల్లో ఆర్యవైశ్యులు ఎప్పుడు ముందుంటారని మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గణపురం సంతోష్ అన్నారు. చలి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని మండలంలోని జైహింద్పూర్ గ్రామంలో గురువారం అరవైశ్య సంఘం ఆధ్వర్యంలో వృద్ధులు, నిరుపేదలకు దుప్పట్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సంతోష్ మాట్లాడుతూ, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో ఆర్యవైశ్య సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి సమాజానికి సేవ చేయడమే లక్ష్యంగా పని చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రావుల కృష్ణ, కోశాధికారి చిలువేరు భాస్కర్, గ్రామా అధ్యక్షులు వెంకటేష్, సంఘం మాజీ అధ్యక్షులు సముద్రాల రాజన్న, సభ్యులు రాజు, రమేష్, పెద్ద వెంకటేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు



ఎంపీడీవో సురేష్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

## గ్రామపంచాయతీ వర్కర్లను తొలగించే విధానాన్ని ఆపాలి

**కెరమెరి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :**

గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న సిబ్బందిని తొలగించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి సిఐటియు జిల్లా కార్యదర్శి రాజేంద్ర అన్నారు గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సురేష్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం సమర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెరమేరి మండల కేంద్రంలో గ్రామపంచాయతీ వర్కర్ గా గత కొన్ని సంవత్సరాల నుండి చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నటువంటి మాకు పోరాటాల ఫలితంగా వచ్చిన జీవో నెంబర్ 51 తో వేతనాలు పెరిగాయి ఆ వేతనాలు కూడా 5నుండి6 నెలలుగా పెండింగ్లో ఉంటాయి కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న అత్యవసర సమయంలో కూడా ఎటు వెళ్లకుండా గ్రామపంచాయతీ పరిధిలో పనిచేస్తున్న క్రమంలో కొన్ని వీళ్ళకి ఏలాంటి ఉద్యోగ భద్రత ప్రమాద బీమా సౌకర్యం లేదు ఎన్నిసార్లు అధికారులకు విన్నవించుకున్న అధికారులు పట్టించుకోకున్న కార్మికులు పనిచేస్తున్నాప్పటికివీరిని తొలగించాలని ప్రయత్నం జరుగుతుందని దీన్ని మండల అధికారులు ఎక్కడ తొలిగింపుకు గురవుతారు అక్కడ అధికారులు దృష్టి సారించి తొలగించకుండా చూసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామని డిమాండ్ చేశారు



## కొనసాగుతున్న సమ్మక్క-సారలమ్మల మొక్కులు

**మందమర్రి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**

శ్రీ సమ్మక్క-సారలమ్మల జాతర ముగిసినప్పటికీ మందమర్రి పట్టణంలో భక్తుల మొక్కులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. జాతర అనంతరం వచ్చే మొదటి వారాన్ని తిరుగు వారంగా భావిస్తూ భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. జాతర రోజుల్లో వివిధ కారణాల వల్ల మొక్కులు చెల్లించలేని భక్తులు, ఈ తిరుగు వారంలో తమ మొక్కుల రూపంలో ఎత్తు బంగారం సమర్పించి అమ్మవార్లకు భక్తి శ్రద్ధలతో మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తుల రాకపోకలతో కిటకిటలాడుతూ ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడుతున్నాయి. అమ్మవార్లపై అపారమైన విశ్వాసంతో భక్తులు తమ కోరికలు నెరవేరినందుకు కృతజ్ఞతగా మొక్కులు చెల్లించుకోవడం సంప్రదాయంగా కొనసాగుతుండటంతో, మందమర్రి పట్టణంలో సమ్మక్క-సారలమ్మల భక్తి ఉత్సవాలు జాతర అనంతరం కూడా విశేషంగా సాగుతున్నాయి.



ఎన్నికల ప్రచార వాహనాల అనుమతుల కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

## మున్సిపల్ కార్యాలయంలో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 05, ప్రభాతవార్త:**

మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెలిసిటేషన్ కేంద్రం, ఎన్నికల ప్రచార వాహనాల అనుమతుల కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా గురువారం పరిశీలించారు. అక్కడ నిర్వహిస్తున్న రిజిస్టర్లను తనిఖీ చేసి, అనుమతుల ప్రక్రియపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం సిబ్బంది విధులు నిర్వహించాలని, అనుమతుల జారీలో జాప్యం జరగకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, నోడల్ అధికారి మనోహర్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్వేత, ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



## నూతన వీవో భవన నిర్మాణానికి భూమి పూజ

**బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 05, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య ఆవరణలో నూతన వీవో భవన నిర్మాణానికి గురువారం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వెంకట్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, గ్రామ సర్పంచ్ పి సాయన్న, మండల సమాఖ్య అధ్యక్షురాలు గంగసాగర పాల్గొన్నారు. రూ.30 లక్షల వ్యయంతో గిడ్డంగి, మరో రూ.10 లక్షల వ్యయంతో వీవో భవనాన్ని నిర్మించనున్నట్లు వారు తెలిపారు. వీటితో పాటు గ్రామ పంచాయతీ పరిధిలో మరో నాలుగు వీవో భవనాలను నిర్మించనున్నట్లు ఏపీఎం వివరించారు. ఈ కార్యక్రమంలో సీసీలు టి శంకర్, పురుషోత్తం, గంగయ్య, నారాయణ, నవీన్, ఈశ్వర్, జమున, వీవో లీడర్లు, వీవోఏలు, మహిళలు పాల్గొన్నారు.

## అక్రమంగా కలప వినియోగిస్తే చర్యలు తప్పవు

**- ఎఫ్‌బిఓ సవిత**

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 05, ప్రభాతవార్త:**

ఇందిరమ్మ ఇండ్లకు లబ్దిదారులు అక్రమంగా కలప వినియోగిస్తే చర్యలు తప్పవువని ఎఫ్‌బిఓ సవిత అన్నారు. గురువారం ఆదిలాబాద్ రూరల్ మండలం పిప్పల్‌ధరి గ్రామంలో పాత కలప వినియోగించుకునే విదానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఫ్‌బిఓ సవిత మాట్లాడుతూ గ్రామంలో పాత దులాలు, మొగురాలతో ఇందిరమ్మ ఇండ్లకు వాడుకునే వారు తప్పని సరిగా అనుమతులు తీసుకోవాలని తెలిపారు. రెవెన్యూ పట్టా భూమిలో అనుమతులు లేకుండా టెకు చెట్లను వాడాకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుమ్ర లక్ష్మీబాయి, ఉపసర్పంచ్ తిరుపతిరెడ్డి, గ్రామ పెద్దలు మినుగు నారాయణ్‌రెడ్డి, చింతల భగవన్, ఈజిఎస్ ఎఫ్ఎ అనిల్, వార్డు సభ్యులు టంకే నాగోరావ్ తదితరులు ఉన్నారు.



## వేట కోసం విద్యుత్తు ఉచ్చు.. నలుగురికి ఏడేళ్ల జైలు

### - పోలీసులను అభినందిన జిల్లా ఎస్పీ

**చింతలమానేపల్లి, ఫిబ్రవరి 05, ప్రభాతవార్త:**

అడవి జంతువుల వేట కోసం అక్రమంగా విద్యుత్తు తీగలు అమర్చి, ఒక వ్యక్తి మరణానికి కారణమైన కేసులో నలుగురు నిందితులకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా ప్రధాన సెషన్స్ న్యాయమూర్తి ఎం.వి. రమేష్ గురువారం తీర్పునిచ్చారు. ఎస్ఐ ఇస్లావత్ నరేష్ తెలిపిన కథనం ప్రకారం మండలంలోని రవీంద్రనగర్ గ్రామానికి చెందిన శ్రీరాంమండల్, రూప్‌కుమార్ మండల్, రామ్ మండల్, కీనా మండల్ అనే వ్యక్తులు 2018 సెప్టెంబరు 15న అడవి జంతువులను వేటాడేందుకు స్థానిక పొలలలో విద్యుత్తు తీగలతో ఉచ్చు బిగించారు. అయితే, అదే గ్రామానికి చెందిన సుకుమార్ రాయ్ అనే వ్యక్తి పొలం పనుల నిమిత్తం వెళ్లి ప్రమాదవశాత్తు ఆ విద్యుత్తు తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై అప్పట్లో ఎస్ఐ రాజ్‌కుమార్, సీఐ మోహన్ కేసు నమోదు చేసి లోతైన దర్యాప్తు చేపట్టారు. పోలీసులు కోర్టులో ప్రవేశపెట్టిన పక్కా ఆధారాలను, సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించిన న్యాయమూర్తి ఎం.వి. రమేష్, నిందితులపై నేరం రుజువైనట్లు నిర్ధారించి. నలుగురు నిందితులకు ఏడేళ్ల కఠిన జైలు శిక్షతో పాటు. ఒక్కొక్కరికి రూ.30,000 చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఒకవేళ జరిమానా చెల్లించని యెడల నిందితులు అదనపు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కేసులో శాస్త్రీయ ఆధారాలను సేకరించి, నిందితులకు శిక్ష పడేలా సమర్థవంతంగా పనిచేసిన డీఎస్పీ ఎం.డి. వాహీదుద్దీన్, సీఐ బి. సంతోష్ కుమార్, బాలాజీ షిండే, సందీప్ కుమార్ పోలీసు బృందాన్ని జిల్లా ఎస్పీ అభినందించారు.



అభినందిస్తున్న మాలి సంఘం నాయకులు

## యువ నాయకత్వానికి గౌరవం.. నీకోడే సందీప్‌కు శాలువాతో సత్కారం

**చింతలమానేపల్లి, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:**

మండల మాలి సంఘం అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన నీకోడే సందీప్‌ను సిర్పూర్ మండల మాలి సంఘం నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగిన మాలి సంఘం ఎన్నికల్లో చింతలమానేపల్లి మండల అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం, మొదటిసారి సిర్పూర్ మండల కేంద్రానికి వచ్చిన సందర్భంగా సిర్పూర్ మాలి సంఘం ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సమాజ సేవలో చురుకుగా ముందుకు సాగే యువ నాయకుడిగా నీకోడే సందీప్ తన బాధ్యతను సమర్థంగా నిర్వర్తిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. సన్మాన కార్యక్రమంలో శాలువాతో ఘనంగా సత్కరించి, స్వీట్లు తినిపిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాలి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్లే శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి నీకోడే గంగారం, సిర్పూర్ మండల మాలి సంఘం అధ్యక్షుడు నానాజీ, ప్రధాన కార్యదర్శి రవి, అలాగే సంఘం నాయకులు వేణు, పరమేశ్వర్, పాండు, రవీందర్, పెద్దలు బెలాజీ, తిరుపతి పాల్గొన్నారు. అదేవిధంగా మాలి యువజన సంఘం కన్నెపల్లి అధ్యక్షుడు మోర్లే పాండు రంగ్, శ్రీనివాస్, ముక్తేశ్వర తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పంటల రక్షణ పేరుతో విద్యుత్ ఫెన్సింగ్ వేయరాదు

**లింగాపూర్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :**



రైతులతో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఎస్పీ జాడే ఉత్తమ్

ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ ఫెన్సింగ్ చేయవద్దు ని విద్యుత్ శాఖ ఎస్సీ జాడే ఉత్తమ్ అన్నారు. శుక్రవారం ఆయన సిర్పూర్ యు, లింగాపూర్ మండలాలలోని పలు గ్రామాలను సందర్శించి ప్రజలతో మాట్లాడారు. అడవి జంతువుల నుంచి పంటలను కాపాడుకునేందుకు వరి పొలాలు, వ్యవసాయ భూముల చుట్టూ అక్రమంగా విద్యుత్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం వల్ల తీవ్రమైన విద్యుత్ ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఉత్తమ్ జాడే, సర్కిల్ సూపెరిడెంట్ ఇంజనీర్, తెలిపారు. ఈ ప్రమాదాల కారణంగా గతంలో అనేక చోట్ల రైతులు, వ్యవసాయ కూలీలు, అలాగే పశువులు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు చోటుచేసుకున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ లైన్లకు నేరుగా లేదా అనధికారికంగా వైర్లు అనుసంధానించి ఫెన్సింగ్ చేయడం పూర్తిగా చట్టవిరుద్ధమని, ఇది అత్యంత ప్రమాదకరమైందని స్పష్టం చేశారు. రాత్రి వేళల్లో లేదా వర్షాకాలంలో ఈ ఫెన్సింగ్ మరింత ప్రమాదకరంగా మారి, పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు తెలియక తాకితే ప్రాణాంతక ప్రమాదాలకు దారి తీస్తుందని తెలిపారు. విద్యుత్ ఫెన్సింగ్ కారణంగా కేవలం మనుషులకే కాకుండా, ఆవులు, ఎద్దులు, మేకలు వంటి పశువులు కూడా విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడుతున్నాయని ఎస్ఈ తెలిపారు. ఇది వారి కుటుంబాలకు తీరని నష్టం కలిగిస్తోందని పేర్కొన్నారు. అక్రమంగా విద్యుత్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల ప్రాణాల భద్రతే విద్యుత్ శాఖ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. రైతులు మరియు ప్రజలు తమ వరి పొలాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయరాదని, పంట రక్షణ కోసం సురక్షితమైన ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించాలని ఎస్ఈ విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా సోలార్ ఆధారిత ఫెన్సింగ్, గార్డింగ్, ఇతర సురక్షిత వ్యవసాయ పద్ధతులను వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలు తమ పరిసరాల్లో ఎక్కడైనా అక్రమ విద్యుత్ ఫెన్సింగ్ ఉన్నట్లు గమనిస్తే వెంటనే సంబంధిత విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఎస్ ఈ కోరారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

### సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ సేవా సమితి ఆధ్వర్యంలో

# ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు

**జైపూర్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**



సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ సేవా సమితి, ఆధ్వర్యంలో ప్లాంట్ ప్రభావిత గ్రామాల మహిళలకు ఉచిత కంప్యూటర్ డిటిపి శిక్షణా తరగతులు గురువారం ప్రారంభించారు. సేవా (సింగరేణి ఎంప్లాయిస్ వైఫ్స్ అసోసియేషన్) అధ్యక్షురాలు సిహెచ్. శివకుమారి చిరంజీవి, సేవా గౌరవ అధ్యక్షురాలు ఆశనరసింహారావులు హాజరై శిక్షణ తరగతులను ప్రారంభించారు. అతిథులుగా ఎస్టీపిపి ఈడి సిహెచ్. చిరంజీవి, (పిసిఎస్) అండ్ (ఓ అండ్ ఎం) జిఎం మదన్ మోహన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సేవా అధ్యక్షురాలు శివకుమారి మాట్లాడుతూ సింగరేణి సంస్థ, సింగరేణి సేవా సమితి ద్వారా ప్లాంట్ ప్రభావిత గ్రామాల యువత, మహిళల కోసం అనేక రకాల ఉపాధి శిక్షణ తరగతులను నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు. ఇప్పటివరకు టైలరింగ్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ వంటి శిక్షణా తరగతులను అందించామని, మెజారిటీ యువత కోరిక మేరకు మొదటి సారి ఇక్కడ కంప్యూటర్ డిటిపి శిక్షణా తరగతులు ప్రారంబిస్తున్నామని తెలిపారు. మహిళలు ఇటువంటి ఉపాధి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని తమ జీవితంలో పైకి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం గత 2024-25 సంవత్సరంలో టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్‌లో శిక్షణ పూర్తి చేసుకుని, ఖాదీ గ్రామోద్యోగ్ హైదరాబాద్ వారు నిర్వహించిన పరీక్షలలో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవా లేడీస్ క్లబ్ సెక్రటరీ నీలిమ పంతుల, సీఎంఓఏఐ ప్రెసిడెంట్ పంతులా, ఏఐటీయూసీ అసిస్టెంట్ పిట్ సెక్రటరీ జోగు పర్శయ్య, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఠాకూర్ మోహన్ సింగ్, సింగరేణి సేవా సమితి కోఆర్డినేటర్ అరుణ, కంప్యూటర్ శిక్షకులు రాజ్ కుమార్, ఇతర అధికారులు, ఉద్యోగులు, మహిళలు సిబ్బంది పాల్గొన్నారు.




## విద్యార్థులు చక్కగా చదువుకొని జీవితంలో స్థిరపడాలి

**జన్నారం, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త**

విద్యార్థులు చక్కగా చదువుకొని జీవితంలో స్థిరపడే విధంగా చదువుపై దృష్టి సారించాలని రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ ఎర్ర చంద్రశేఖర్ అన్నారు. గురువారం నాడు జన్నారం మండల కేంద్రంలోని రాఘవేంద్ర కరిమల జూనియర్ కళాశాల విద్యార్థులు సీనియర్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ ఎర్ర చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు ఇంటర్ తర్వాత చదువుకునే డిగ్రీ విద్య జీవితంలో స్థిరపడడానికి ఎంతో ముఖ్యమైనదని అందుకే చదువును నిర్లక్ష్యం చేయకూడదని అన్నారు. పై చదువుల కోసం విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లడం బాధగా ఉన్న చదువు అనేది ముఖ్యమని ఎక్కడ ఉన్నా ఆయురారోగ్యాలతో ఉండాలని అన్నారు. అనంతరం ఇంత కాలం పాటు కళాశాలలో నిర్వహించిన ఆటపాటల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అదేవిధంగా మోటివేషనల్ స్పీకర్ దాసరి రంజిత్ ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులు చెడుదారుల వెళ్లకుండా ఉండేందుకు ఏం చేయాలో అలాగే ఇంటర్మీడియట్ తర్వాత ఏం చేయాలో పిల్లలకు అర్థమయ్యేలా పలు సూచనలు చేశారు. ఈ వీడ్కోలు సమావేశంలో ఇంతకాలం పాటు కలిసిమెలిసి ఆప్యాయంగా పలకరించుకుంటూ కాలం గడపడం సంతోషంగా ఉన్నప్పటికీ కళాశాలను వదిలి పై చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లడం బాధగా ఉందని జూనియర్ విద్యార్థులు భావోద్వేగానికి లోనయ్యారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎర్ర సంపత్, డీన్ హేమలత షిండే, కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మణ్, జయరాణి హై స్కూల్ ప్రిన్సిపాల్ మధుసూదన్, రాఘవేంద్ర లిటిల్ హాన్స్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.